

సాక్షి
ఖమ్మం
శనివారం । 14 । జూన్ । 2025



బ్రాండ్ అంబాసిడర్ కీర్తన

వైరా మండలం నారపునేనిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గత ఏడాది నాలుగో తరగతి విద్యార్థి ఎస్.కీర్తన మాత్రమే మిగలగా అధికారులు స్కూల్ మూసివేతకు నిర్ణయించారు. కానీ ఆమె తండ్రి అనిల్‌శర్మ మాత్రం పాఠశాల మూసివేస్తే తన కుమార్తె చదువు మాన్పిస్తానని చెప్పడంతో కొనసాగించిన విషయం విదితమే. ఆపై పాఠశాలలో వసతులు కల్పించడంతో పాటు ఉపాధ్యాయులు బడిబాట ద్వారా చేసిన కృషితో ఈసారి పది మంది ప్రవేశాలు పొందారు. ఈమేరకు పాఠశాల నిలబడడానికి కారణమైన కీర్తనను బ్రాండ్ అంబాసిడర్‌గా భావిస్తూ ఆమె ఫొటోను బడి గోడపై ఆకట్టుకునేలా వేయించగా స్థానికులు అభినందిస్తున్నారు. – వైరారూరల్

పదవుల టెన్షన్..



ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలకు నామినేటెడ్ పదవుల టెన్షన్ పట్టుకుంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా తమ సేవలకు గుర్తింపు లేదనే నైరాశ్యం అలుముకుంటోంది. 'అధికారంలో లేకపోయినా పార్టీని అంటి పెట్టుకుని ఉన్నాం, ఇప్పుడు అధికారంలోకి వచ్చినా మాకు గుర్తింపు లభించడం లేదు' అన్న ఆవేదన వ్యక్తమవుతోంది. మరోవైపు నామినేటెడ్ పదవులపై ఆశ పెట్టుకున్న వారికి రాష్ట్ర స్థాయి పార్టీ పదవులు కేటాయిస్తున్నా ఇంకొందరు ఆశ వదులుకోలేక జిల్లా మంత్రుల ఆశీస్సుల కోసం ప్రయత్నిస్తున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు వస్తాయని అటు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఇటు జిల్లా మంత్రులు చెబుతుండగా ఇది జరిగేది ఎన్నడోనని ఆశావహులు ఎదురుచూస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

'నామినేటెడ్' ఆశావహుల్లో ఆందోళన

- కుర్చీ లేక ముఖ్య నేతల్లో నైరాశ్యం
- పార్టీ పదవులతోనే సరిపెడుతున్న అధిష్టానం
- ముగ్గురు మంత్రుల ఆశీస్సుల కోసం నాయకుల హైరానా

'హస్త'వాసి పెరిగినా..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ అత్యధిక సీట్లు గెలవడం ఒక కారణంగా చెప్పవచ్చు. ఇక్కడ పది స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎనిమిది మంది, పొత్తులో భాగంగా మరో స్థానంలో సీపీఐ అభ్యర్థి గెలిచారు. ఇలా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంలో ఉమ్మడి జిల్లా తగిన బలాన్ని ఇచ్చినా ఆ స్థాయిలో పదవులు రాలేదన్న చర్చ ముఖ్య నేతల్లో జరుగుతోంది. ఒకటి, రెండు ఎమ్మెల్సీ స్థానాలు వస్తాయన్న ప్రచారం తొలి నాళ్లల్లో ప్రచారం జరిగినా ఆశపడిన నేతలకు నామినేటెడ్ పదవులతో సరిపెట్టారు. ఇంకా డజన్ మందికి పైగా నామినేటెడ్ పదవులను ఆశిస్తుండగా, ఇటీవల ప్రకటించిన టీపీసీసీ కార్యవర్గంలో కొందరికి స్థానం దక్కింది. దీంతో ఆశావహుల సంఖ్య తగ్గినప్పటికీ తమకు అనుకున్న పదవులు రావడం లేదనే అంతర్మథనంలో పలువురు ఉన్నారు.

ఆ పదవులు పెండింగ్‌లోనే..

చిన్నాచితక నామినేటెడ్ పదవులు కూడా ప్రకటించక ఆశావహుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. జిల్లాలోని వైరా, ఏన్కూరు మార్కెట్ కమిటీలను ప్రకటించకపోగా, ఏన్కూరు మార్కెట్ ఏజెన్సీ పరిధిలో ఉండడంతో సందిగ్ధత వీడడం లేదు. ఇక జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ప్రముఖ ఆలయ కమిటీల కోసం పలువురు కాంగ్రెస్ నేతలు యత్నిస్తున్నా భర్తీపై జాప్యం జరుగుతోంది. ఇదిలా ఉండగా త్వరలో గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతాయనే ప్రచారంతో అప్పటి వరకైనా నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తారా, లేదా అని ఆశావహులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సుడా.. పీఠం ఎవరికి?

ఉమ్మడి జిల్లాలో సుడా(స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ పదవిని నామినేటెడ్ పదవుల్లో కీలకంగా భావిస్తారు. గతంలో ఖమ్మం కార్పొరేషన్ వరకే దీని పరిధి ఉండగా ఇప్పుడు ఐదు నియోజకవర్గాలకు విస్తరించడంతో రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. జిల్లాలోని రియల్ ఎస్టేట్ అంతా 'సుడా' పరిధిలోనే జరగనుండడం, అనుమతులు కీలకం కావడంతో పదవి దక్కించుకుంటే ఆర్థిక వనరులు సమకూరుతాయనే ప్రచారం జరుగుతోంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు నియోజకవర్గాలు సుడా పరిధిలోనే ఉండగా.. పదవులు ఆశిస్తున్న నేతలు మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా ఎవరికి పదవి దక్కుతుందోనన్న సస్పెన్స్ మాత్రం వీడడం లేదు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌గా అనుదీప్ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ అనుదీప్‌నకు మొక్క అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేయగా హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఖమ్మం కలెక్టర్‌గా నియమించారు. దీంతో ఆయన శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి అనుదీప్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, డీఆర్వో పద్మశ్రీ, ఆర్డీఓ నర్సింహారావు, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, టీజీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రితో పాటు పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు కూడా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

రూ.50 లక్షలతో భవిత కేంద్రాల ఆధునికీకరణ

- జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు 59



మంద్రాజుపల్లి విద్యార్థులతో మాట్లాడుతున్న సీఎంఓ రాజశేఖర్

నేలకొండపల్లి: జిల్లాలోని భవిత కేంద్రాల ఆధునికీకరణ కోసం నిధులు కేటాయించినట్లు విద్యాశాఖ సీఎంఓ వై.రాజశేఖర్ తెలిపారు. మండలంలోని మంద్రాజుపల్లి, నేలకొండపల్లి, బోదులబండ ప్రభుత్వ పాఠశాలలు, సింగారెడ్డిపాలెంలోని భవిత కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేసిన ఆయన విద్యార్థుల ప్రగతి, బడిబాటపై ఉపాధ్యాయులతో చర్చించాక మాట్లాడారు. జిల్లాలో 22 భవిత కేంద్రాలు ఉండగా, పక్కా భవనాల ఉన్నచోట మరమ్మతులు, సౌకర్యాల కల్పనకు రూ.50 లక్షలు కేటాయించడమే కాక దివ్యాంగుల రవాణాకు వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, ఐఈఆర్‌పీలు, ఫిజియోథెరపిస్ట్‌లను నియమించనున్నామని వెల్లడించారు. కాగా, జిల్లాలో ఇప్పటివరకు ఒక్క విద్యార్థి చేరని పాఠశాలలు 59 ఉండగా, వీటిలో కనీసం పది పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు కార్యాచరణ రూపొందించామని సీఎంఓ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈఓ బి.చలపతిరావు, హెచ్‌ఎం తొర్తి గురవయ్య పాల్గొన్నారు.

తీసుకున్న రుణం కట్టాల్సిందే...

రైతులకు ఏదులాపురం సొసైటీ నుంచి నోటీసులు

ఖమ్మంరూరల్: ఏదులాపురం సొసైటీ చైర్మన్ లక్ష్మణ్ నాయక్ తమ పేరిట రుణాలు తీసుకున్నారని పలువురు రైతులు వారం రోజులుగా ఆందోళనలు చేపడుతున్నారు. ఈ విషయమై అధికారులు విచారణ చేపడుతుండగానే.. పీఏసీఎస్ సిబ్బంది మాత్రం రైతులకు నోటీసులు జారీ చేస్తూ అప్పు కట్టాలని ఒత్తిడి చేస్తుండడం గమనార్హం. రైతుల సంతకంతో అందిన దరఖాస్తుతో రుణాన్ని మంజూరు చేసినందున తిరిగి చెల్లించాలని సిబ్బంది స్పష్టం చేస్తున్నారు. రైతులు మాత్రం తమకు రూ.50వేల రుణమని చెప్పిన చైర్మన్ రూ.లక్ష చొప్పున తీసుకున్నాడని.. ఆపై రుణమాఫీ అవుతుందని నమ్మబలికి మోసం చేశాడని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలువురు డీసీఓకు ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాలతో గురువారం సొసైటీల అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.ఉషశ్రీ విచారణ చేపట్టిన విషయం విదితమే. పలువురు రైతులు చైర్మన్ ఎదురుగానే తమ పేరిట రుణాలు తీసుకున్నాడని వాంగ్మూలం ఇచ్చారు. విచారణ పూర్తయ్యాక ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఉషశ్రీ వెల్లడించారు. ఇంతలోనే శుక్రవారం సొసైటీ సిబ్బంది గూడురుపాడులో రైతుల ఇళ్లకు వెళ్లి రుణాలు చెల్లించాలని స్పష్టం చేయడం గమనార్హం. అయితే, నివేదిక ఇవ్వడానికి సమయం పడుతుందని, ఆతర్వాత ఏ నిర్ణయం తీసుకుంటారోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

రుణాలు తిరిగి చెల్లించాల్సిందే..

రైతులు రుణం తీసుకున్నట్లుగా రికార్డులు ఉన్నాయి. ఆతర్వాత బయట ఏం జరిగిందో మాకు తెలియదు.. ఆయా అంశాలతో మాకు సంబంధం లేదు. నిబంధనల ప్రకారం రుణమాఫీ జరిగాక మిగిలిన వారు రుణాలను చెల్లించాల్సిందే. అందుకే మా సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్తున్నారు.

– మహమూద్ అలీ, సొసైటీ సీఈఓ

వార్షిక రుణప్రణాళిక.. రూ.16వేల కోట్లు

- వ్యవసాయ రంగానికి అత్యధిక కేటాయింపులు
- మొత్తం రుణాల్లో రూ.50.94శాతం ఈ రంగానికే..
- 4.98లక్షల మందికి ప్రయోజనం కలిగేలా రూపకల్పన



వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ, బ్యాంకర్లు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక రుణ ప్రణాళిక ఖరారైంది. రూ.16,185.12 కోట్లతో రూపొందించిన ప్రణాళికను జిల్లా లీడ్ బ్యాంకు శుక్రవారం విడుదల చేసింది. మొత్తం 4,98,651 మంది బ్యాంకు ఖాతాదారులకు రుణాలు ఇవ్వనుండగా.. 50.94 శాతం రుణాలను వ్యవసాయ అవసరాలకు కేటాయించారు. అలాగే, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, విద్య, గృహ, సామాజిక, పునరుత్పాదక శక్తి తదితర రంగాలకే కాక ప్రాధాన్యేతర రంగాలకు ప్రణాళికలో ప్రాధాన్యత కల్పించారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట

వార్షిక రుణ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి ఎప్పటి మాదిరిగానే ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లాలో పెద్దసంఖ్యలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నందున మొత్తం రుణాల్లో 50.94 శాతం ఈ రంగానికి కేటాయించారు. మొత్తం 4,22,519 మంది వ్యవసాయ, అనుబంధ రైతులకు రూ. 8,244.72 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిధుల నుంచి రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ విధానం ద్వారా బ్యాంకులు రుణాలను మంజూరు చేస్తాయి.

పారిశ్రామిక, ఇతర రంగాలకు...

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ. 2,968.30 కోట్లు కేటాయించారు. ఇందులో సూక్ష్మ పరిశ్రమలకు ప్రాధాన్యతగా రూ. 1,813.60 కోట్లు, చిన్న పరిశ్రమల స్థాపనకు రూ.908.60 కోట్లు, మధ్య తరహా పరిశ్రమలకు రూ.246.10 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. తద్వారా మొత్తం 22,428 మందికి లబ్ధి జరగనుంది. ఇక విద్య, గృహ, సామాజిక మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక శక్తి, ఇతర రంగాల్లో 3,320 మందికి ప్రయోజనం కలిగేలా రూ.289.30 కోట్లు కేటాయించారు. ఇందులో విద్యా రంగానికి రూ.97 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.63.40 కోట్లు కేటాయించగా, ప్రాధాన్యేతర రంగాల్లో 50,384 మందికి ప్రయోజనం కలిగే విధంగా రూ.4,682.80 కోట్ల రుణాలు ఇచ్చేలా ప్రణాళికలో పొందుపరిచారు.

ప్రాధాన్యతల ఆధారంగా కేటాయింపులు

జిల్లాలో రుణాలకు సంబంధించి ప్రాధాన్యత రంగాల వారీగా ప్రణాళిక రూపొందించాం. జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ రూపొందించిన ప్రాధాన్యతలను పరిగణనలోకి తీసుకున్నాం. జిల్లాలో ప్రధాన రంగం వ్యవసాయమే కావడంతో 50 శాతానికి పైగా నిధులను కేటాయించాం. వివిధ రంగాల అభివృద్ధి, తద్వారా జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళిక అమలుచేస్తాం.

– ఏ.శ్రీనివాసరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్

లక్ష్య సాధనకు బ్యాంకర్లు తోడ్పాటునివ్వాలి

ప్రభుత్వ లక్ష్యాల మేరకు రుణమంజూరులో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన డీసీసీ(డిస్ట్రిక్ కన్సల్టేటివ్ కమిటీ), డీఎల్‌ఆర్సీ(డిస్ట్రిక్ లెవల్ రివ్యూ కమిటీ) సమావేశాల్లో బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. గత ఏడాది రైతులకు పంట రుణాలను లక్ష్యానికి మించి 20 శాతం అదనంగా పంపిణీ చేశామని, ఈసారి కూడా అదే ఆనవాయితీ కొనసాగించాలని తెలిపారు. అలాగే, ఎంఎస్‌ఎంఈ రంగానికి రుణ పంపిణీలో శ్రద్ధ చూపాలని, విద్య, గృహ రుణాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని చెప్పారు. అనంతరం జిల్లా వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ఏ.శ్రీనివాసరెడ్డి, ఎల్‌డీఓ చేతన్ గోరేకర్, నాబార్డ్ డీడీఎం సుజిత్‌కుమార్, ఎస్‌బీఐ ఆర్‌ఎం రాజశేఖర్, వివిధ బ్యాంకులు, సంక్షేమ శాఖల అధికారులు విజయ్‌కుమార్, వసంతరావు, లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్



ఖమ్మంలీగల్: జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు న్యాయ సేవా సదన్‌లో లోక్ అదాలత్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కేసుల పరిష్కారం కోసం పలు బెంచ్‌లను ఏర్పాటు చేయడమే కాక కక్షిదారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.

'ఫాల్ట్ ప్యాసేజ్' ఇండికేటర్ల ఏర్పాటు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని విద్యుత్ ఫీడర్లపై ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్ల(ఎఫ్‌పీఐఎల్ఎస్) ఏర్పాటు పనుల్లో అధికారులు వేగం పెంచారు. ప్రకృతి వైపరీత్యాలు, ఈదురుగాలుల సమయాన విద్యుత్ అంతరాయం ఏర్పడుతుండగా, నిర్దిష్టమైన ప్రాంతాన్ని గుర్తించి సరిచేసేందుకు సమయం పడుతోంది. ఈనేపథ్యాన కచ్చితమైన ప్రదేశాన్ని గుర్తించేందుకు ఎన్పీడీసీఎల్ అధికారులు ఎఫ్‌పీఐఎల్ఎస్ ఏర్పాటుకు నిర్ణయించారు. జిల్లాలోని 33 కేవీ 18 ఫీడర్లపై 78 చోట్ల, 11 కేవీ 37 ఫీడర్లపై 170 చోట్ల ఏర్పాటుచేయనుండగా, ఇప్పటికే పలు చోట్ల బిగించామని ఎస్ఈ శ్రీనివాసాచారి తెలిపారు. త్వరలోనే మిగతా చోట్ల అమరుస్తామని వెల్లడించారు.

అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కోయచలకలో చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన జెడ్పీ సీఈఓ దీక్ష తదితరులు

రఘునాథపాలెం: అభివృద్ధి విషయంలో ఖమ్మం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించిన ప్రభుత్వం సంక్షేమ పథకాలతో అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తోందని చెప్పారు. రఘునాథపాలెం మండలంలోని కోయచలక, రేగులచలకల్లో శుక్రవారం ఆయన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశాక మాట్లాడారు. జిల్లాలో అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రిని ఒప్పించి రూ.100 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. వానాకాలం సీజన్‌లో రైతులు వరినాట్లు వేయకముందే వారి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తామని చెప్పారు. కాగా, గ్రామాల్లో రోడ్ల విస్తరణకు ప్రజలు సహకరించడమే కాక అనారోగ్యం దరి చేరకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. తొలుత కోయచలక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ అందజేసిన మంత్రి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీపీఓ డి.పుల్లయ్య, ఆర్డీఓ నరసింహారావు, ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ఎంఈఓ రాములు, హెచ్‌ఎం శిరీష, పీఆర్ డీఈ మహేష్, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌తో పాటు చెరుకూరి పూర్ణ, యండపల్లి సత్యం, అన్నం భూషయ్య, రాంప్రసాద్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వాంకుడోత్ దీపక్, మాధంశెట్టి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికే పదవులు

పార్టీ కోసం కష్టపడిన వారికి తప్పక పదవులు లభిస్తాయని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కాంగ్రెస్ రఘునాథపాలెం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం బాలాపేటలో నిర్వహించగా ఆయన మాట్లాడారు. ప్రతీ కార్యకర్త పార్టీకి అండగా నిలిస్తే నిరుత్సాహానికి గురిచేయకుండా పదవుల్లో అవకాశం కల్పిస్తామని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు కాలర్ ఎగరేసుకునే స్థాయికి చేరుస్తామని, తద్వారా తనకు కూడా గౌరవం దక్కుతుందని తెలిపారు. రఘునాథపాలెం మండల అభివృద్ధికి ఇప్పటికే రూ.500 కోట్లకు నిధులు తెచ్చినందున మిగతా పదవీకాలంలో మరిన్ని నిధులు సాధిస్తానని చెప్పారు. కాగా, పలు గ్రామాల నాయకులు ఈ సమావేశంలో మాట్లాడుతూ తమకు పార్టీలో తగిన గుర్తింపులేదని, కార్యక్రమాల సమాచారం ఇవ్వకపోగా నాయకులు అందరినీ కలుపుకోవడం లేదని, మైనార్టీలకు పార్టీ పదవుల్లో అవకాశాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయన అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈసమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రాయల నాగేశ్వరరావు, మార్కెట్, ఆత్మ కమిటీల చైర్మన్లు యరగర్ల హన్మంతరావు, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లుతో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, మానుకొండ రాధాకిషోర్, సాధు రమేష్‌రెడ్డి, వాంకుడోత్ దీపక్, తాతా రఘురాం, చెరుకూరి పూర్ణ, దేవ్ సింగ్, రామూర్తి, యండపల్లి సత్యం, రెంటాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం మంత్రి తుమ్మల బైక్‌పై బాలసాని లక్ష్మీనారాయణను ఎక్కించుకుని నడపగా.. బైక్ నిలిపే సమయాన అదుపు తప్పుతుండడంతో నాయకులు స్పందించగా ప్రమాదం తప్పింది.



రైల్వే స్టేషన్ పాత భవనం



కూల్చివేసిన చోట శిథిలాలు

చెదిరిన జ్ఞాపకం

ఖమ్మం రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ పథకం ద్వారా రూ.కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా స్టేషన్ కార్యకలాపాల నిర్వహణ కోసం ప్రధాన భవనాన్ని కొత్తగా నిర్మించారు. దీంతో దశాబ్దాలుగా ఉన్న ముఖద్వారం, ఏళ్లుగా బుకింగ్ కౌంటర్లను శుక్రవారం కూల్చివేశారు. దీంతో ఆ ప్రాంతం బోసిపోయి కనిపిస్తోంది. తరచుగా ఖమ్మం స్టేషన్ నుంచి రాకపోకలు సాగించేవారు అక్కడి శిథిలాలను చూస్తూ పాత భవనం ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తుండడంతో వైరల్‌గా మారాయి. అంతేకాక స్టేషన్ పరిసరాల్లో వ్యాపారాలు చేస్తున్న వారు కూడా ఆనాటి జ్ఞాపకాలను తలుచుకుంటున్నారు.

– ఖమ్మం రాపర్తినగర్

విద్యార్థులకు సీట్ల కేటాయింపు



సీటు కేటాయింపు లేఖ అందిస్తున్న డీడీ

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ అభివృద్ధి శాఖ ద్వారా ఎంపిక చేసిన కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో మొదటి విడతగా పలువురు విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ఆయా విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం సీట్లు కేటాయిస్తూ ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ శుక్రవారం లేఖలు అందజేశారు. మొదటి దశలో 94 మంది విద్యార్థులు ఎంపిక కాగా.. శుక్రవారం 64 మంది హాజరుకావడంతో సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం సీట్లు కేటాయించారు. మిగతా విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో సోమవారం తమ కార్యాలయంలో హాజరు కావాలని డీడీ సత్యనారాయణ సూచించారు.

నేడు 'విత్తన' ముసాయిదా కమిటీ సమావేశం

ఖమ్మంవ్యవసాయం: విత్తన చట్టం ముసాయిదా కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అధ్యక్షతన శనివారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లో ఈ సమావేశం మొదలవుతుందని పేర్కొన్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వ్యవసాయాధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, కేవీకేలు, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులతో పాటు విత్తన డీలర్ల అసోసియేషన్ బాధ్యులు, పలువురు ఆదర్శ రైతులు పాల్గొంటారని డీఏఓ తెలిపారు.

క్లుప్తంగా

సివిల్స్ అభ్యర్థులకు లాంగ్ టర్మ్ శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లాలో డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్–2026 కోసం లాంగ్ టర్మ్ శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు జూలై 7న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి, జూలై 25 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు హైదరాబాద్ లక్ష్మీనగర్‌లోని బీసీ స్టడీసర్కిల్‌లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. మొత్తం 150మందికి శిక్షణ ఇవ్వనుండగా 100మందిని ఆన్‌లైన్ టెస్ట్ ద్వారా, ఇంకో 50మంది గతంలో సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారిని ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 16 నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు 'టీజీ బీసీ స్టడీసర్కిల్, రోడ్డు నంబర్ 8, లక్ష్మీనగర్‌కాలనీ, సైదాబాద్, హైదరాబాద్'లో దరఖాస్తులు అందజేయాలని డైరెక్టర్ సూచించారు.

డైట్‌లో అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం డైట్‌లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ తెలిపారు. వివిధ సబ్జెక్టుల బోధనకు ఎనిమిది మంది నియమించనుండగా, ఆయా సబ్జెక్టుల్లో 50శాతం కనీస మార్కులతో ఉత్తీర్ణులైన వారు గెస్ట్ ఫ్యాకల్టీగా అర్హులని వెల్లడించారు. 65ఏళ్లలోపు వయస్సు కలిగిన రిటైర్డ్ అధ్యాపకులతో పాటు ఇతరులకు అవకాశముండగా, ఎంఈడీ అభ్యర్థులు లేని పక్షంలో బీఈడీ అభ్యర్థులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు ఈనెల 19వ తేదీ లోగా టేకులపల్లిలోని డైట్ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

16 నుంచి లాం ఫామ్‌లో మిరప విత్తనాల విక్రయం

ఖమ్మంవ్యవసాయం: ఏపీలోని గుంటూరు లాం ఫామ్ ప్రాంతీయ ఉద్యాన పరిశోధన స్థానంలో ఈనెల 16వ తేదీ నుంచి ఎల్‌సీఏ 625, ఎల్‌సీఏ 657, ఎల్‌సీఏ 643 మిరప ఫౌండేషన్ విత్తనాలను రైతులకు విక్రయించనున్నారు. ఈ విషయాన్ని ఫామ్ అసోసియేట్ డైరెక్టర్ పి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం, ఆదివారం మినహా ప్రతిరోజు ఉదయం 9నుంచి సాయంత్రం 4 గంటల వరకు రైతులకు నేరుగా విత్తనాలు విక్రయిస్తామని పేర్కొన్నారు. కిలో విత్తన ధర రూ.1,200గా నిర్ణయించామని, వివరాలకు 99898 09554, 94405 92982 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

13 మందికి సెల్‌ఫోన్లు అప్పగింత



ఫోన్లు అందజేస్తున్న అడిషనల్ డీసీపీ

ఖమ్మంక్రైం: వివిధ ప్రాంతాల్లో 13 మంది సెల్‌ఫోన్లు పోగొట్టుకోగా, సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్) ద్వారా గుర్తించిన పోలీసులు తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా బాధితులకు శుక్రవారం ఫోన్లు అందజేసిన అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు మాట్లాడారు. వీటి విలువ రూ.4లక్షలు ఉండగా, సీఈఐఆర్ ద్వారా ఇప్పటివరకు ఖమ్మం కమిషనరేట్ పరిధిలో 2,276 ఫోన్లను ట్రాక్ చేశామని తెలిపారు. ఫోన్ల రికవరీలో కీలకంగా వ్యవహరించిన ఐటీ సెల్ ఎస్సై సత్యనారాయణ, ఉద్యోగులను సీపీ, అడిషనల్ డీసీపీ అభినందించారు.

సోనో విజన్‌లో లక్కీ డ్రా



బహుమతులు అందిస్తున్న సోనోవిజన్, ఎల్‌జీ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని సోనోవిజన్‌లో ఎలక్ట్రానిక్ పరికరాలు కొనుగోలు చేసిన వారి నుంచి శుక్రవారం లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. అనంతరం రోటరీనగర్‌లోని సోనోవిజన్ షోరూంలో విజేతలకు బహుమతులు అందించారు. ఎల్‌జీ కంపెనీ చాంపియన్ ప్రీమియర్ లీగ్ పేరిట నిర్వహించిన లక్కీ డ్రాలో వాషింగ్ మిషన్ కొనుగోలు చేసిన రవికుమార్ రూ.40 వేల విలువైన రిఫ్రిజిరేటర్, ఏసీ కొనుగోలు చేసిన నాగయ్య రూ.40 వేల విలువ చేసే వాషింగ్ మిషన్ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో ఎల్‌జీ మార్కెటింగ్ మేనేజర్ కిరణ్, ఏఎస్‌ఎం రవి, సోనోవిజన్ మేనేజర్లు రాంబాబు, రవికుమార్, కల్యాణ్ పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,100	1,850
పెసలు	6,100	4,000
మినుములు	5,500	5,500
మిర్చి	10,500	5,400
ఏసీ మిర్చి	14,125	7,500
మిర్చి తాలు	6,800	4,100
పత్తి	6,700	6,000

– ఖమ్మం వ్యవసాయం

రక్తం పంచుతున్న బంధువులు

- రక్తదానంతో ప్రాణదాతలుగా గుర్తింపు
- తలసేమియా బాధితులతో పాటు గర్భిణులకు చేయూత
- రెడ్‌క్రాస్, సంకల్ప సంస్థల అవగాహనతో ముందుకు..

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం





సంకల్ప సంస్థ, బాలాజీ ఎస్టేట్స్ తరఫున రక్తదాన శిబిరం (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: ఓ ప్రాంతం కాదు.. ఒకే ఊరు కాదు.. రక్తం పంచుకుని పుట్టలేదు. కానీ ఆపదలో ఉన్న వారికి సాయం చేయాలన్న తపనతో రక్తదానం చేస్తున్న పలువురు ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. ప్రమాదాల్లో గాయపడిన, అత్యవసర చికిత్స చేయించుకుంటున్న వారి కోసం కబురు అందితే చాలు వాలిపోయి రక్తం పంచుతున్నారు. మా జీవిత కాలం పెంచండి.. అంటూ కోరే తలసేమియా చిన్నారులు, ప్రసవం కోసం ఆస్పత్రుల్లో చేరిన మహిళల కోసం మేమున్నామంటూ ముందు నిలుస్తున్న పలువురు ఆదర్శంగా నిలుస్తున్నారు.

మిత్రులు బృందాలుగా..

రక్తదానం విలువ తెలిసిన జిల్లాలోని పలువురు యువకులు బృందాలుగా ఏర్పడుతున్నారు. పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్, ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ బృందం, యువజన చేయూత(టేకులపల్లి), యువ భారత్ శక్తి(వైబీఎస్), జూనియర్ ఎన్టీఆర్ ఫాన్స్, ఆశ్రయ సేవా సొసైటీ, వీఆర్ విత్ యూ, మిస్సైల్ మ్యాన్ హెల్పింగ్ హ్యాండ్స్(ఎంఎంహెచ్‌హెచ్), బత్తినేని చారిటబుల్ ట్రస్ట్, జనసేన అభిమానులు, కొత్తగూడెం బ్లడ్ డోనర్స్ ఇలా పలు గ్రూప్‌ల సభ్యులు క్రమం తప్పకుండా మూడు నెలలకోసారి రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక పోలీస్ శాఖ సైతం తలసేమియా చిన్నారుల కోసం ప్రత్యేకంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ అభినందనలు అందుకుంటోంది. ఉమ్మడి జిల్లాలో 300 మందికి పైగా తలసేమియా చిన్నారులు నిశ్చింతగా ఉండడానికి రక్తదాతల సహకారమే కారణమని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యులు చెబుతున్నారు. అంతేకాక రెడ్ క్రాస్ సొసైటీ కూడా రక్తదానం చేసేలా యువతను ప్రోత్సహిస్తోంది.



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు (ఫైల్)

మూడునెలలకు ఒకసారి..

రక్తం అవసరమైన వారికి చేయూతనిచ్చేలా రక్తదాతలు స్నేహితులతో కలిసి వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఆ గ్రూప్‌ల్లో రక్తం కావాలనే అందితే నేరుగా ఆస్పత్రులకు వెళ్తున్నారు. అంతేకాక దాతలు ప్రతీ మూడు నెలలకోసారి బ్లడ్ బ్యాంక్‌లకు వెళ్లి రక్తదానం చేయడాన్ని ఆనవాయితీగా పెట్టుకున్నారు. వీరిని చూసి మరికొందరు రక్తదాతలు ముందుకొస్తుండడం విశేషం. కాగా, తలసేమియా చిన్నారులను ఆదుకునేందుకు 2009లో ఖమ్మంలో హోంగార్డు ప్రొద్దుటూరి రవిచంద్ర – కండక్టర్ పి.అనిత కుటుంబం 'సంకల్ప' పేరిట సంస్థను ఏర్పాటు చేశారు. చిన్నారులకు రక్తం ఆవశ్యకతను వివరిస్తుండడంతో దాతలు ముందుకొచ్చారు. ఇదేసమయాన తలసేమియా చిన్నారుల సంఖ్య పదుల సంఖ్య నుండి వందలకు చేరడంతో ఈ చిన్నారులకే కాక ప్రాణాప్రాయ స్థితిలోఉన్న వారికి రక్తదానం చేసేలా యువతను ప్రోత్సహిస్తున్నారు.

తలసేమియా చిన్నారులు నిశ్చింతగా..



వేలాది మంది రక్తదాతల సహకారంతోనే తలసేమియా చిన్నారులు నిశ్చింతగా జీవిస్తున్నారు. రక్తం అవసరముందని సమాచారం ఇస్తే చాలు పలువురు ముందుకొస్తున్నారు. వేసవిలోనూ చిన్నారులు ఇబ్బంది పడలేదంటే దాతల చేయూతే కారణం. **– ప్రొద్దుటూరి రవిచందర్, సంకల్ప సంస్థ**

క్యాంపులు, అవగాహన



ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం అందేలా రెడ్‌క్రాస్ సొసైటీ కీలకంగా వ్యవహరిస్తోంది. నెలకు 3–4 క్యాంపుల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రి లోని రక్తనిధికి రక్తాన్ని సేకరిస్తున్నాం. యువత రక్తదానం చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. **– వెలిగేటి చంద్రమోహన్, చైర్మన్, రెడ్‌క్రాస్ సొసైటీ**

ప్రతీ మూడు నెలలకోసారి..



2019 నుండి రక్తదానం చేయడం మొదలుపెట్టా. ప్రతీ మూడు నెలలకోసారి తప్పనిసరి రక్తదానం చేస్తూ ప్రతీ నెల ఆశ్రయ సేవా సొసైటీ ద్వారా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. మా స్నేహితుల సహకారంతో ఇప్పటికే వెయ్యి మందికి రక్తదానం చేశాం. **– ఇరుగు నవీన్, ఆశ్రయ సేవా సొసైటీ సభ్యుడు**

ఎప్పుడు అడిగినా వెళ్తా..



నాది 'ఏబీ' గ్రూప్ రక్తం. ఈ గ్రూప్ రక్తదాతలు తక్కువగా ఉండడంతో తలసేమియా చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని సంకల్ప సంస్థ బాధ్యులు చెప్పారు. అప్పటి నుంచి సంస్థ తరఫున సమాచారం ఇస్తే చాలు వెళ్లి రక్తదానం చేస్తున్నా. **– గుడిమెట్ల నాగరాజు, రక్తదాత**

భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకొచ్చిన భూ భారతి చట్టం ద్వారా భూసమస్యలు పరిష్కారం లభిస్తుందని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో సహకార శాఖ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యలపై అధికారులు జారీ చేసిన ఆర్డర్లపై అభ్యంతరం ఉంటే అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. గతంలో సివిల్ కోర్టుల ద్వారా మాత్రమే లభించే పరిష్కారం కొత్త చట్టంతో రెవెన్యూ వ్యవస్థ వద్ద లభిస్తుందని చెప్పారు. వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ విచారించి మ్యుటేషన్ చేస్తారని తెలిపారు. అనంతరం చట్టంపై పలువురి సందేహాలను అదనపు కలెక్టర్ నివృత్తి చేశారు. డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, జిల్లా సహకార అధికారి జి.గంగాధర్, డీసీసీబీ సీఈఓ ఎన్.వెంకట్‌ఆదిత్య, వరంగల్ కోఆపరేటివ్ ట్రెయినింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ రాజయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ఎండీ.అన్వర్, కె.కిషోర్‌తో పాటు పీఏసీఎస్‌ల చైర్మన్లు, సీఈఓలు పాల్గొన్నారు.

ఈ తిప్పలు ఎన్నాళ్లు..



ఒకే గదిలో కొనసాగుతున్న పాఠశాల



తరగతి గదిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఒకే గది, 55 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు... ఇదీ ఖమ్మం 57వ డివిజన్‌లోని దివ్యాంగుల కాలనీ ప్రభుత్వ పాఠశాల పరిస్థితి. మొత్తం 55మందిలో 30మందికి పైగా విద్యార్థులు హాజరవుతుండగా ఒకేగదిలో 1నుంచి 5వ తరగతి వరకు బోధించడం ఇబ్బందిగా మారింది. ఇటీవల అధికారులు పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మిస్తామని చెప్పినా నిర్మాణం జరిగే వరకు అద్దె భవనమైనా సమకూర్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

గిరిప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖమ్మంమామిళ్లగూడెం: వచ్చే నెల 10న బుద్ధ పూర్ణిమ సందర్భంగా అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్లు ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం తెలిపారు. అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ఖమ్మం రీజియన్‌లోని మణుగూరు, సత్తుపల్లి, ఖమ్మం డిపోల నుంచి సూపర్ లగ్జరీ బస్సులు నడిపిస్తామని పేర్కొన్నారు. జూలై 8న సాయంత్రం 7 గంటలకు ఖమ్మం నుంచి, మణుగూరు నుంచి 6 గంటలకు, సత్తుపల్లి నుంచి 7 గంటలకు బయలుదేరే బస్సులు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం తర్వాత 9వ తేదీ రాత్రి అరుణాచలం చేరుకుంటాయని తెలిపారు. అలాగే, 10వ తేదీన గిరిప్రదక్షిణ, అరుణాచలేశ్వరుడి దర్శనం అనంతరం మధ్యాహ్నం బయలుదేరే బస్సులు 11వ తేదీన ఉదయం డిపోలకు చేరుకుంటాయని పేర్కొన్నారు. ఖమ్మం, సత్తుపల్లి నుంచి పెద్దలకు రూ.5 వేలు, పిల్లలకు రూ.2,500, మణుగూరు నుంచి పెద్దలకు రూ.5,500, పిల్లలకు రూ.2,750 చార్జీగా నిర్ణయించినట్లు ఆర్‌ఎం తెలిపారు. ఇతర వివరాలు, రిజర్వేషన్ కోసం మణుగూరు డిపో మేనేజర్ (99592 25963), సత్తుపల్లి డీఎం 99592 25962, ఖమ్మం డీఎం 99592 25958 నంబర్లలో సంప్రదించాలని ఆర్‌ఎం సూచించారు.

కళాశాలలో ప్రవేశాలు పెరగాలి

తిరుమలాయపాలెం: పిండిప్రోలు ప్రభుత్వ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాల సంఖ్య పెరిగేలా అధ్యాపకులు విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవిబాబు సూచించారు. కళాశాలకు శుక్రవారం వచ్చిన ఆయన బోధన, గత ఏడాది ఫలితాలపై ఆరా తీశాక అధ్యాపకులతో సమావేశమయ్యారు. కాలేజీలో ఉచిత విద్య, పుస్తకాలు, స్కాలర్‌షిప్ అందుతున్నాయనే అంశాన్ని తల్లిదండ్రులకు వివరించి పిల్లలను చేర్పించేలా చూడాలని తెలిపారు. అనంతరం తాయన విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న డీఐఈఓ రవిబాబు

మంత్రిని కలిసిన బదిలీ కలెక్టర్



ముజమ్మిల్‌ఖాన్‌ను సన్మానించిన మంత్రి తుమ్మల

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీ అయిన ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. క్యాంపు కార్యాలయంలో మంత్రిని ఆయన కలవగా సత్కరించి కలెక్టర్‌గా ముజమ్మిల్ ఖాన్ చేసిన సేవలను గుర్తుచేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే టీబీ నియంత్రణ

వైరా: టీబీ సోకడానికి కారణాలు, చికిత్సపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, తద్వారా వ్యాధి నియంత్రణ సాధ్యమవుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి, జిల్లా క్షయవ్యాధి నివారణాధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు సూచించారు. వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరంలో శుక్రవారం నిర్వహించిన 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' సమావేశంలో వారు మాట్లాడారు. 60ఏళ్లు పైబడిన వారే కాక షుగర్, హెచ్ఐవీ, కేన్సర్ బాధితులు టీబీ పరీక్ష చేయించుకోవాలన్నారు. అనంతరం పలువురు గ్రామస్తులను పరీక్షించి అవసరమైన వారికి ఖమ్మం ఆస్పత్రికి రిఫర్ చేశారు. వైద్యులు శ్రీహర్ష, మారె బాబు, ఉద్యోగులు ఇమామ్, తార, శివ, శ్రీలత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఐఐటీకి చేరిన గిరిజన విద్యార్థులు

సన్మానించిన ఐటీడీఏ పీఓ రాహుల్



సన్మానం అందుకున్న విద్యార్థులతో ఐటీడీఏ పీఓ, అధికారులు

రఘునాథపాలెం: మారుమూల గిరిజన ప్రాంతాల నిరుపేద విద్యార్థులు గురుకులాల్లో చదుతూ తమ ప్రతిభ ద్వారా దేశంలోని ప్రఖ్యాత ఐఐటీల్లో సీట్లు సాధించడం అభినందనీయమని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. రఘునాథపాలెం గిరిజన గురుకుల ప్రతిభా కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి ఐఐటీలు, నిట్‌ల్లో సీట్లు సాధించగా భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం వారిని సన్మానించారు. ఈసందర్భంగా పీఓ మాట్లాడుతూ గురుకులాల్లో ఉన్న వసతులకు తోడు విద్యార్థుల కష్టం, అధ్యాపకుల కృషితో ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. కాగా, ఐఐటీలు, నిట్‌ల్లో సాధించిన కె.మన్యం, పి.ప్రశాంత్, పి.విఘ్నేశ్వర్, డి.చరణ్, ఆర్.సందీప్, ఎం.రాంచరణ్, ఆర్.భాను కుమార్, ఎం.ప్రకాశ్‌రాజ్, ఎం.గణేష్, బి.సిద్ధు, బి.వాసుని సన్మానించిన పీఓ భవిష్యత్‌లో మరింతగా రాణించాలని సూచించారు. గురుకులాల ఆర్‌సీఓ అరుణకుమారి, కళాశాల ప్రిన్సిపాల్ మల్లెల బాలస్వామి, వైస్ ప్రిన్సిపాళ్లు మిట్టపల్లి నరసింహారావు, మాలోత్ శ్రీనివాస్, అధ్యాపకులు శివశంకరాచారి, సత్యనారాయణ, హరీష్, రమేష్, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, రమ్య, ఏసోబు పాల్గొన్నారు.

పులిసిపోయిన చట్నీ, అధిక ధరలు

బస్టాండ్‌లోని ఫుడ్‌కోర్టులో తనిఖీ, జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా ఆహార తనిఖీ అధికారులు హోటళ్లలో తనిఖీ చేస్తూ ఆహార కల్తీ, అపరిశుభ్ర వాతావరణంపై జరిమానా విధిస్తున్నా ఖమ్మంలోని కొందరి తీరు మారడం లేదు. ఈనేపథ్యాన కొత్త బస్టాండ్‌లోని ఫుడ్ కోర్టు, దుకాణాల్లో వాటర్ బాటిళ్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ఆహార పదార్థాలు నాసిరకంగా ఉండడంతో పాటు వంటశాలలు అధ్వానంగా మారాయని పలువురు కేఎంసీ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ ద్వారాఫిర్యాదు చేశారు. దీంతో శానిటేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య, ఉద్యోగులు శుక్రవారం ఫుడ్ కోర్టులో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్‌లో పరిశీలించగా పులిసిపోయిన చట్నీ, దోసల పిండికి తోడు అపరిశుభ్రతను చూసి చట్నీని పడబోయించారు. కాగా, వినియోగదారులు కేఎంసీ అధికారులకు సమస్యలు వివరిస్తుండగా హోటల్, దుకాణాల నిర్వాహకులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. కాగా, ఫుడ్‌కోర్టులో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుండడంతో కేఎంసీ అధికారులు రూ.2వేల జరిమానా విధించారు. అయితే, కేఎంసీ అధికారులు తనిఖీ చేయడంపై తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ఆర్టీసీ ఉద్యోగి ఒకరు ప్రశ్నించడం గమనార్హం.



ఫుడ్ కోర్టు వద్ద ఉద్యోగులకు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారులు

కలెక్టరేట్ ఏఓగా స్వామి

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ)గా సీహెచ్.స్వామి నియమితులయ్యారు. ప్రస్తుతం ఏఓగా కొనసాగుతున్న అరుణను కొణిజర్ల తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమె స్థానంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా ఉన్న స్వామిని నియమించారు. దీంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

పెరిగిన హాజరుశాతం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాసంవత్సరం రెండో రోజైన శుక్రవారం విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. మొత్తం 58,326మంది విద్యార్థులకు గాను 32,301మంది హాజరు కాగా 55శాతంగా హాజరు నమోదైందని డీఈఓ సామినేని సత్యనారాయణ తెలిపారు. అలాగే, బడిబాటలో భాగంగా శుక్రవారం 598మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడంతో ఈ సంఖ్య మొత్తం 3,985కు చేరిందని వెల్లడించారు.

రూ.30 లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మం గాంధీనగర్‌కు చెందిన గుడారి రాజేందర్ రూ.30,57,864కు గాను దివాలా పిటిషన్(ఐపీ) దాఖలు చేశాడు. ఫార్మా డిస్ట్రిబ్యూటర్‌గా వ్యాపారం చేసిన ఆయన పలువురి వద్ద అప్పులు చేశాడు. ప్రస్తుతం నష్టం ఎదురై అప్పులు తీర్చలేని పరిస్థితి ఉందంటూ 24 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.

మద్యం మత్తులో ఘర్షణ, కత్తితో దాడి

కల్లూరు: కల్లూరులోని ఎన్నెస్పీ రింగ్ రోడ్డులో ఇద్దరి నడుమ మద్యం మత్తులో జరిగిన ఘర్షణ కత్తితో దాడికి దారి తీసింది. నారాయణపురం వెళ్లే టర్నింగ్‌లో బైక్ మెకానిక్ షెడ్‌కు చెందిన మేక రవికి నాయుడు రాజు మధ్య శుక్రవారం సాయంత్రం వివాదం చోటు చేసుకుంది. వీరు మద్యం మత్తులో ఉండగా, రాజు కోడి కత్తితో మేక రవి మెడ వద్ద పొడిచాడు. దీంతో స్థానికులు ఆయనకు కల్లూరులో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

బాత్‌రూమ్‌లో జారిపడి ఉపాధ్యాయుడు మృతి

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు బాలుర ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు బాత్‌రూమ్‌లో జారి పడడంతో మృతి చెందాడు. ఖమ్మం జిల్లా మద్దులపల్లికి చెందిన నల్లగొండ రాజేంద్ర ప్రసాద్(55) పేరూరు బాలుర ఆశ్రమ పాఠశాలలో మూడేళ్ల నుంచి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం బడిబాట కార్యక్రమానికి వెళ్లాల్సి ఉండగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రాజేంద్రప్రసాద్‌కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో క్వార్టర్స్‌లోనే ఉండాలని సహచరులు చెప్పి బయలుదేరారు. ఆతర్వాత హాస్టల్ ఉద్యోగులు రాజేంద్రప్రసాద్ కోసం భోజనం తీసుకురాగా బాత్‌రూమ్‌కు వెళ్లొచ్చాక తింటానని చెప్పాడు. అయితే, చాలాసేపటి వరకు బయటకు రాకపోవడంతో సిబ్బంది తలుపు తెరిచి చూడగా కింద పడి ఉన్నాడు. దీంతో పేరూరు ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఏటూరునాగారం తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన బాత్‌రూమ్‌లో పడడంతో అపస్మారక స్థితికి చేరి మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. రాజేంద్రప్రసాద్‌కు భార్య ప్రమీలరాణి, కుమారుడు రామ్‌కుమార్, కుమార్తె స్రవంతి ఉండగా, కుమారుడు తండ్రి మృతదేహం పడి రోదించడం కలిచివేసింది.



రాజేంద్ర ప్రసాద్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెం సమీపాన ఖమ్మం – వైరా ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఖమ్మం నుంచి బైక్‌పై ఇద్దరు వెలుగుమట్ల ప్రాంత వాసులు వస్తుండగా యూ టర్న్ తీసుకునే క్రమంలో వైరా వైపు నుంచి వస్తున్న మినీ ట్రక్కు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ వెనకాల కూర్చున్న వ్యక్తి మృతి చెందగా, నడుపుతున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చల్లా శ్రీనివాస్‌గా గుర్తించినా ఆయన కోమాలో ఉండడంతో మృతుడి వివరాలు తెలియరాలేదని సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.